క్లుప్తంగా

అయ్యప్పస్వామికి పూజలు



స్వామివారి చక్రస్నానంలో అర్చకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని 10వ డివిజన్ చైతన్యనగర్ ఎన్‌టీఆర్ బైపాస్ రోడ్డులో నూతనంగా ప్రారంభించినశ్రీధర్మశాస్తా(అయ్యప్ప స్వామి) దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ ముగింపు వేడుకల్లో భాగంగా శనివారం పల్లకీ సేవ, చక్రస్నానం పూజలు చేశారు. అనంతరం నగరంలో స్వామివారిని శోభాయాత్రగా ఊరేగింపు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కేరళ వేద పండితుడు, ఆలయ చైర్మన్ మేకల హనుమంతురావు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

వరి పొలాల పరిశీలన

కూసుమంచి: మండలంలోని లోక్యాతండాలో వరి పొలాలను శనివారం ఏఓ రామడుగు వాణి పరిశీలించారు. వరిలో కంకినల్లి, మానిపండు తెగుళ్ల సోకడంతో పాటు కాండం తొలిచే పురుగు ఉధృతి ఉన్నట్లు గుర్తించి వాటి నివారణకు చేపట్టాల్సిన సస్యరక్షణ చర్యలను రైతులకు ఆమె వివరించారు. వరి పంట పలుచోట్ల కంకి దశలో, మరి కొన్నిచోట్ల కోత దశలో ఉన్నందున పంట చేతికొచ్చేంత వరకు రైతులు జాగ్రత్తలు పాటించాలన్నారు. వ్యవసాయశాఖ అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

పార్టీ బలోపేతానికి సహకరించండి

ఖమ్మం మామిళ్లగూడెం: బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని బీజేపీ నూతన జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు కోరారు. శనివారం బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు సన్నె ఉదయ్‌ప్రతాప్‌ను బురాన్‌పురంలోని ఆయన నివాసంలో కలవగా.. ఆయన సత్కరించారు. అనంతరం కోటేశ్వరరావు మాట్లాడగా.. నాయకులు మేకల నాగేందర్, మహేందర్‌సింగ్, ఖమ్మం అర్బన్ టౌన్ అధ్యక్షుడు కుమిలి శ్రీనివాసరావు, రాజేష్ గుప్త, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ స్థల పరిశీలన

నేలకొండపల్లి: మండలంలోని కోనాయిగూడెం విద్యుత్ సబ్‌స్టేషన్ స్థలాన్ని శనివారం రెవెన్యూ, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు. స్థలం వెంట ఉన్న బాధిత రైతులు ఫిర్యాదులు చేయడంతో క్షేత్రస్థాయిలో స్థలాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం రైతులకు నష్టం జరగకుండా స్థలంలో హద్దులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో డీఈఈ చింతమళ్ల నాగేశ్వరరావు, తహసీల్దార్ జె.మానిక్‌రావ్, ఏఈ నారాయణరావు, సర్వేయర్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్ పెంపుపై హర్షం

ఖమ్మం మామిళ్లగూడెం: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు తెలంగాణ బీసీ జేఏసీ ఆధ్వర్యాన హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు శనివారం కేంద్ర గ్రంథాలయంలో మిఠాయిలు పంపిణీ చేసి, పూలే ప్రాంగణంలో టపాసులు కాల్చారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ పెరుగు వెంకటరమణ యాదవ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ శాతాన్ని కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరారు. ఈ విషయంలో బీసీలంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో చేకూరి చైతన్య, జి.నరేందర్, తీగల రాము పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం బైపాస్ రోడ్డులోని శ్రీసీతారామ కల్యాణమండపంలో ఆదివారం జరిగే భారతీయ కిసాన్‌సంఘ్ జిల్లా స్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘ జిల్లా అధ్యక్షుడు బండి కృష్ణారెడ్డి శనివారం ఒక ప్రకటనలో కోరారు. వ్యవసాయ రంగంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, దాని అనుబంధ రంగాల బలోపేతానికి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.

ఖమ్మం రైతుబజార్, సమీకృత మార్కెట్

కూరగాయలు కేజీ ధర (రూ.ల్లో)		ఆకుకూరల కట్టలు (రూ.ల్లో)	
టమాట	20	బచ్చలికూర	4
వంకాయ	28		20
బెండకాయ	28	పాలకూర	4
పచ్చిమిర్చి	28		20
కాకర	34	చుక్కకూర	4
బీట్‌రూట్	24		20
బీర	48	తోటకూర	4
దొండ	30		20
పొట్లకాయ	38	గోంగూర	3
చిక్కుడు	78		20
గోరుచిక్కుడు	48	మెంతికూర	3
క్యాబేజీ	20		20
క్యాలీఫ్లవర్	35	కొత్తిమీర	1
ఆలుగడ్డ	30		25
చామగడ్డ	58	పుదీన	1
క్యారెట్	24		20
క్యాప్సికం	48	-ఖమ్మం వ్యవసాయం	

పచ్చందం.. సన్నద్ధం!



పండితాపురం నర్సరీలో పెంచుతున్న మొక్కలు

నర్సరీల్లో జోరుగా మొక్కల పెంపకం

- గ్రామానికో నర్సరీ చొప్పున ఏర్పాటు
- 24 జీపీల్లో 1.20 లక్షల మొక్కల పెంపకమే లక్ష్యం
- నిత్యం పర్యవేక్షిస్తున్న అధికారులు

కామేపల్లి: ఊరూరా పచ్చదనం కనిపించేలా పర్యావరణ పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ఏటా జూన్‌లో వనమహోత్సవం నిర్వహిస్తోంది. దీనిలో భాగంగా మొక్కలు నాటేందుకు ప్రతీ గ్రామ పంచాయతీలో నర్సరీలు ఏర్పాటు చేసింది. ఇప్పటికే జీపీ నర్సరీల్లో జోరుగా మొక్కల పెంపకం చేపట్టారు. మండలంలో మొత్తం 24 జీపీల్లో 1.20 లక్షల మొక్కలు పెంచేందుకు చర్యలు చేపట్టారు.



తాళ్లగూడెం నర్సరీలో మొక్కల పెంపకాన్ని పరిశీలిస్తున్న ఎంపీడీఓ రవీందర్(ఫైల్)

జోరుగా పనులు..

24 జీపీలోని నర్సరీ పనులు జోరుగా సాగుతున్నాయి. నర్సరీలు ఏర్పాటు చేసే స్థలాల వద్ద మట్టి కుప్పలు పోయించి ఉపాధి కూలీలతో ప్లాస్టిక్ సంచుల్లో మట్టిని నింపే ప్రక్రియ పూర్తయింది. బ్యాగుల్లో ఇప్పటికే విత్తనాలు నాటగా.. వాటిని సంరక్షించేలా ఆయా శాఖల అధికారులు కీలకంగా వ్యవహరించనున్నారు. మండల ప్రత్యేకాధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, ఎంపీడీఓ, ఉపాధి హామీ ఏపీఓ, సిబ్బంది నిత్యం నర్సరీలను పర్యవేక్షిస్తున్నారు. విత్తనాలు ఉన్న సంచుల్లో నీటిని చల్లించడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించే పనులు చేయిస్తున్నారు.

పంచాయతీకి 5 వేల మొక్కలు..



ప్రతీ గ్రామ పంచాయతీల్లోని నర్సరీల్లో 5 వేల మొక్కలు పెంచనున్నాం. ఇందులో ఈత, తాటి, ఔషధగుణాలు కలిగిన మొక్కలు ఎక్కువగా నాటాం. ఎండ తీవ్రత నుంచి కాపాడుకునేలా షేడ్‌నెట్లు ఏర్పాటు చేశాం. నర్సరీలను ఎప్పటికప్పుడూ పర్యవేక్షిస్తూ సిబ్బందికి తగు సూచనలు చేస్తున్నాం.
– రవీందర్, ఎంపీడీఓ, కామేపల్లి

సూచనలు పాటిస్తున్నాం..



నర్సరీలో మొక్కల పెంపకంపై అధికారుల సూచనలు పాటిస్తున్నాం. ఈత, తాటి మొక్కలతో పాటు మునగ, కలబంద, కరివేపాకు వంటి ఔషధమొక్కలు నాటాం. ఎండ తీవ్రత నుంచి కాపాడేలా తగిన చర్యలు చేపట్టాం. బ్యాగుల్లో చనిపోయిన మొక్కల స్థానంలో మరో మొక్కను నాటుతున్నాం.
– డి.మాన్‌సింగ్, ఫీల్డ్ అసిస్టెంట్, పండితాపురం

నీటిని పొదుపుగా వాడుకోవాలి

రఘునాథపాలెం: ప్రతి ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలని, మొక్కలను విరివిరిగా నాటాలని భూగర్భ జలవనరుల శాఖ అధికారి జి.విష్ణు పేర్కొన్నారు. శనివారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా రఘునాథపాలెంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో భూగర్భ జలాల వినియోగం, నిర్వహణ, పెంపుదల, రీచార్జ్ పద్ధతులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్ల పెంపకంతో వరదలు తగ్గించుకోవచ్చని, రైతులు డ్రిప్పులు, స్ప్రింక్లర్ల ద్వారా తక్కువ నీటితో పంటలు పండించుకోవచ్చన్నారు. అనంతరం ఎంపీఓ అశోక్‌కుమార్, తహసీల్దార్ జి.లూథర్‌విల్సన్ తదితరులు మాట్లాడాక విద్యార్థులకు నీటి ప్రాముఖ్యతపై వ్యాస రచన పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. తర్వాత మండలంలో తక్కువ నీటిని వినియోగిస్తూ వ్యవసాయం చేసే ముగ్గురు రైతులు యాదగిరి, ఏసోబు, సునీల్‌లను సన్మానించాక జల ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో భూగర్భ జలశాఖ అధికారులు నరేష్, శిల్ప, నాగవేణి, మండల హార్టికల్చర్ అధికారి జి.నగేష్, నరసింహారావు, యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ డైరెక్టర్ వాణి, హరిప్రసాద్, టీం సభ్యులు, విద్యార్థులు, రైతులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

త్వరలోనే సేవలన్నీ అందుబాటులోకి..



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరెడ్డి

ఖమ్మంరూరల్: ఏదులాపురం మున్సిపాలిటీలో అన్ని రకాల సర్వీసులు త్వరలోనే అందుబాటులోకి వస్తాయని కమిషనర్ ఆళ్ల శ్రీనివాసరెడ్డి అన్నారు. శనివారం పెదతండాలోని మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు జారీ చేస్తున్నట్లు, మరో మూడు రోజుల్లో ఇంటికి సంబంధించిన అనుమతులు కూడా ఇస్తామని తెలిపారు. సిబ్బందికి ఎప్పటికప్పుడు శిక్షణ ఇస్తూ మున్సిపల్ పరిపాలన అందేలా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. వేసవిలో తాగునీటి కొరత లేకుండా చూడడంతో పాటు పారిశుద్ధ్యంపై ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నామన్నారు. అధికారులు స్పందించకుంటే కార్యాలయానికి నేరుగా రావొచ్చన్నారు. ఈ సమావేశంలో కె.శ్రీధర్‌రెడ్డి, మేనేజర్ మనీ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

దళితుల సమస్యల పరిష్కారంలో విఫలం

తిరుమలాయపాలెం: దళితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం చెందిందని కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పాపిట్ల సత్యనారాయణ ఆరోపించారు. శనివారం తిరుమలాయపాలెంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో కుల వివక్ష, అంటరానితనం ఇంకా కొనసాగుతుందని వాటికి వ్యతిరేకంగా దళితులు ఉద్యమించాలన్నారు. పౌరుల హక్కుల దినోత్సవం సందర్భంగా ప్రతీ సోమవారం అధికారులు దళితవాడలో పర్యటించి దళితులపై జరుగుతున్న దాడులు, దౌర్జన్యాలను అరికట్టేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి దాసరి మహేందర్, నాయకులు శ్రీను, నాగేశ్వరరావు, ప్రభాకర్, శ్రీను, రాము, మహేష్, సుందరయ్య, లక్ష్మీనారాయణ, పీడియాల రామారావు, పుట్టల గురువులు తదితరులు పాల్గొన్నారు.

అనాథశవానికి అంత్యక్రియలు



మృతదేహం వద్ద ఫౌండేషన్ బాధ్యులు

ఖమ్మంవైద్యవిభాగం: ఇటీవల టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గుర్తుతెలియని యాచక వృద్ధుడు మృతి చెందగాపోలీసులు మృతదేహాన్ని ఖమ్మం పెద్దాస్పత్రి మార్చురీకి తరలించారు. ఇప్పటి వరకు మృతదేహం కోసం ఎవ్వరూ రాకపోవడంతో టూటౌన్ పోలీసులు, వైద్యశాల సిబ్బంది సమాచారం మేరకు అన్నం ఫౌండేషన్ సభ్యులు శనివారం బల్లేపల్లిలోని వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సంస్థాగత బలోపేతమే లక్ష్యం..

ఖమ్మం మామిళ్లగూడెం: సంస్థాగత బలోపేతమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందించుకుని ముందుకు సాగాలని సీపీఐ జాతీయ సమితి సభ్యుడు బాగం హేమంతరావు పిలుపునిచ్చారు. ప్రజా సంఘాల మండల, జిల్లా మహాసభలను ఏప్రిల్ చివరి నాటికి పూర్తి చేయాలని కోరారు. శనివారం శింగు నర్సింహారావు అధ్యక్షతన ఖమ్మం సీపీఐ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది సీపీఐ శత వసంత ఉత్సవ జాతీయ స్థాయి ముగింపు సభ ఖమ్మంలోనే జరగనున్నందున పార్టీ మహాసభలను కూడా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి సమస్యల పరిష్కారం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. యువజన విద్యార్థులు పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలన్నారు. డిసెంబర్ 26న జరిగే శత వసంత ఉత్సవ ముగింపు సభకు జిల్లా నుంచి రెండు వేల మంది జన సేవాదళ్ కార్యకర్తలను తయారు చేయాలని, ఈలోపు జిల్లా వ్యాప్తంగా శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర సమితి సభ్యులు జమ్ముల జితేందర్‌రెడ్డి, యర్రాబాబు, ఏపూరి లతాదేవి, కొండపర్తి గోవిందరావు, సిద్ధినేని కర్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హేమంతరావు

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

ఖమ్మంవన్‌టౌన్: రఘునాథపాలెం మండలానికి చెందిన లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను రాష్ట్ర యువజన నాయకుడు తుమ్మల యుగంధర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ ఆధ్వర్యాన శనివారం రఘునాథపాలెం మండల సమన్వయ కమిటీకి అందించారు. మొత్తం 24మందికి కలిపి రూ.10.75లక్షల చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం వ్యవసాయ శాఖ మార్కెట్ చైర్మన్ యరగర్ల హనుమంతరావు, నాయకులు గుత్త వెంకటేశ్వర్లు, రావూరి సైదాబాబు, ఎండీ ఆశ్రిఫ్, పూర్ణ, బాణాల లక్ష్మణ్, బొమ్మ ఉదయ్, తుపాకుల శ్రీను, కాటేపల్లి క్రాంతికుమార్, అల్లం సాయికుమార్, కుక్కల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

ఖమ్మంఅర్బన్: నగరంలోని మమతా డెంటల్ కాలేజీలో మెడికో కళాశాల పీజీ పూర్వ విద్యార్థులు శనివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా తమ అనుభవాలను పంచుకుని వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. ఈ కార్యక్రమంలో మమతా ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ పువ్వాడ జయశ్రీ,, డాక్టర్ నరేన్, ప్రిన్సిపాల్ జి.వెంకటేశ్వరరావుతో పాటు అనితారావు, పూర్వ అధ్యాపకులు పాల్గొన్నారు.

'స్మార్ట్ కిడ్జ్' వార్షికోత్సవం

ఖమ్మం సహకారనగర్: నగరంలోని స్మార్ట్‌కిడ్జ్ పాఠశాల 13వ వార్షికోత్సవాన్ని పాఠశాల ఆవరణలో శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, జిల్లా విద్యాశాఖాధికారి ఈ.సోమశేఖరశర్మ, ఫేమా కన్వీనర్ మువ్వా శ్రీనివాసరావు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు గుర్రం కాంతారావు, పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణచైతన్య, డైరెక్టర్ చింతనిప్పు సుకన్యలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మాట్లాడుతూ.. విద్యార్థులను అన్ని రంగాల్లో అధిరోహించేలా తీర్చిదిద్దుతున్నామన్నారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్, ఉపాధ్యాయ, ఉపాధ్యాయేతర సిబ్బంది పాల్గొన్నారు.

'త్రివేణి'లో ఎర్త్ అవర్ క్యాంపెయిన్

ఖమ్మం సహకారనగర్: నగరంలోని త్రివేణి పాఠశాలలో ఎర్త్ అవర్ క్యాంపెయిన్, వాటర్ డే అవగాహన కార్యక్రమాలను శనివారం నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ గొల్లపుడి వీరేంద్రచౌదరి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎన్‌సీఎస్‌సీ కో ఆర్డినేటర్ ఎనుముల వెంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కృష్ణవేణి- త్రివేణి విద్యాసంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సమయాన్ని వృథా చేయొద్దు..

రఘునాథపాలెం: విద్యార్థులు సమయాన్ని వృథా చేసుకోకుండా చదువుపై దృష్టి సారించాలని జెడ్పీ సీఈఓ దీక్షరైనా సూచించారు. శనివారం రఘునాథపాలెంలోని మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ రెసిడెన్షియల్ మహిళ డిగ్రీ కళాశాల వార్షికోత్సవ సభలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జీవితంలో గెలుపోటములు సహజమని, పట్టుదల, కృషితో దేనినైనా సాధించవచ్చని తెలిపారు. అనంతరం విద్యార్థుల నృత్యాలు అలరించగా, వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.వెంకటేశ్వర్లు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆర్‌సీఓ రాంబాబు, కవి యాకుబ్, ప్రముఖ మ్యూజిక్ డైరెక్టర్ బల్లెపల్లి మోహన్, రవికుమార్, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి బహుమతి అందిస్తున్న జెడ్పీ సీఈఓ

ప్రతీ క్షణం విలువైనదే..

ఖమ్మం సహకారనగర్: విద్యార్థులకు ప్రతీ క్షణం విలువైనదే అని, దాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకుని భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఏసీపీ ఎస్.వెంకటేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎస్‌బీఐటీ కళాశాలలో ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌ల ఇబ్బందులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సరైన పద్ధతిలో ఫోన్‌ను వినియోగించుకుని ఉన్నతంగా ఎదగాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ మాట్లాడుతూ.. దురాశతో బెట్టింగ్ యాప్‌ల వ్యసనాలకు లోనై తమ విలువైన జీవితాన్ని కోల్పోవద్దని సూచించారు.కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రి, అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎస్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి' కూలీలను పెంచాలి

నేలకొండపల్లి: ఉపాధి హామీ పనుల్లో కూలీలను మరింత పెంచాలని ఎంపీడీఓ ఎం.యర్రయ్య సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులను పరిశీలించి మస్టర్లను తనిఖీ చేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతీ పంచాయతీలో కూలీలకు సరిపడా పనులు కల్పించడం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడడం వంటి చర్యలు చేపడుతున్నామన్నారు. అలాగే నర్సరీల్లో మొక్కల సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నాచేపల్లిలో కూలీలతో మాట్లాడుతున్న ఎంపీడీఓ

అగ్రికల్చర్ డ్రోన్ ప్రారంభం



డ్రోన్ పని తీరును పరిశీలిస్తున్న మేయర్

ఖమ్మంమయూరిసెంటర్: ఖమ్మం నగరపాలక సంస్థ ఆధ్వర్యాన నూతనంగా కొనుగోలు చేసిన అగ్రికల్చర్ డ్రోన్‌ను మేయర్ పునుకొల్లు నీరజ శనివారం ప్రారంభించారు. అత్యవసర సమయాల్లో, వరదల సమయాల్లో ఆహార పదార్థాలు, లైఫ్ జాకెట్స్ అందించేందుకు రూ.5 లక్షలతో కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొత్తపల్లి నీరజ, సైదులు, మలీదు వెంకటేశ్వర్లు, ఈఈ కృష్ణాలాల్, డీఈఈ ధరణికుమార్, ఉద్యాన అధికారిణి బి.రాధిక, ఏఈలు యాకూబ్‌వలి, తేజ పాల్గొన్నారు.

కుట్టు మిషన్లు, తోపుడు బండ్ల పంపిణీ..

గతేడాది సెప్టెంబర్‌లో వచ్చిన మున్నేరు వరదలతో ఉపాధి కోల్పోయిన వీధి వ్యాపారులు, మహిళలకు హెచ్‌ఎస్‌బీసీ ఆధ్వర్యాన తోపుడు బండ్లు, కుట్టు మిషన్లను మేయర్ నీరజ పంపిణీ చేశారు. శనివారం నగరంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో వీటిని అందించారు. వీటితో పాటు వెయింగ్‌మిషన్లు, మెకానికల్, ఎలక్ట్రికల్ టూల్స్, హోటల్స్ సామగ్రి అందజేశారు.

కేఎంసీ సమాచారం..

- **బిస్కెట్ల వ్యాపారికి జరిమానా**

ఖమ్మంమయూరిసెంటర్: కాలం చెల్లిన బిస్కెట్లు, తినుబండారాలను అనుమతి లేకుండా డంపింగ్ యార్డ్‌లో పోసేందుకు ప్రయత్నించిన ఓ వ్యాపారికి కేఎంసీ అధికారులు రూ.2 వేల జరిమానా విధించారు. ట్రాలీ ఆటో ద్వారా డంపింగ్‌యార్డ్‌కు గడువుతీరిన బిస్కెట్లు, ఇతర తినుబండారాలను తీసుకురాగా.. అక్కడి సిబ్బంది కేఎంసీ శానిటరీ సూపర్‌వైజర్ సాంబయ్యకు సమాచారం అందించారు. దీంతో వెంటనే ఆటోను కేఎంసీకి తరలించి అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీ ఉల్లా ఆధ్వర్యాన జరిమానా విధించారు. కాలం చెల్లిన ఆహారపదార్థాలు, ఇతర వ్యర్థాలు డంపింగ్‌యార్డ్‌లో పోయరాదని హెచ్చరించారు.

- **దుకాణాలు సీజ్..**

ఖమ్మం నగర పాలక సంస్థకు చెందిన భవనాలను అద్దెకు తీసుకుని అద్దె చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తున్న ఇద్దరు వ్యాపారుల దుకాణాలను కేఎంసీ అధికారులు సీజ్ చేశారు. ఇందులో ఓ వ్యాపారి రూ.1.80 లక్షల వరకు అద్దె చెల్లించాల్సి ఉండగా.. మరో వ్యాపారి రూ.లక్షకు పైగా చెల్లించాల్సి ఉంది. ఈమేరకు ఆయా దుకాణాలను రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. అద్దెలను సకాలంలో చెల్లించకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

కమిషనర్‌కు వినతి

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం 37వ డివిజన్ సమస్యలపై బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మార్తి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యాన శనివారం కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వీరభద్రప్రసాద్ మాట్లాడుతూ.. స్టేషన్ రోడ్డు నుంచి కస్బాబజార్ వరకు రోడ్డుకు ఇరువైపులా వేసిన తాత్కాలిక గుడారాలు పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది ఎదురవుతోందని, రోడ్డు పక్కన వేసిన వ్యాపార కూడలిని తొలగించాలని కోరారు. టూటౌన్ అధ్యక్షుడు వెంకటనారాయణయాదవ్, ఉపాధ్యక్షుడు బోయినపల్లి చంద్రశేఖర్, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధు, సుందరస్వర్ణ, వీరభద్రం, జగదీష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



భూములను పరిశీలిస్తున్న నాయకులు


తిరుమలాయపాలెం: మండల కేంద్రంలో 254 సర్వే నంబర్‌లో ఆక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూమిని గుర్తించి ప్రభుత్వం మంజూరు చేసిన ఐటీఐ కళాశాల నిర్మాణం చేపట్టాలని అఖిలపక్షం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం తిరుమలాయపాలెంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి ప్రభుత్వ భూమిని పరిశీలించారు. ప్రధాన రహదారికి సమీపంలో ఉన్న ప్రభుత్వ భూమిలో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పలు పార్టీల నాయకులు శ్రీను, సోమనపల్లి వెంకటేశ్వర్లు, తిమ్మిడి హనుమంతరావు, గొర్రెపాటి రమేష్, కొమ్ము వీరబాబు, గంట కృష్ణ, పోలెపొంగు వెంకటేశ్వర్లు, కొత్త బాలాజీరావు, కొమ్ము పుల్లయ్య, గద్దల నాగేశ్వరరావు, గుగ్గిళ్ల అశోక్, రాము, కాంపాటి బాబురావు, వీరన్న పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

ఖమ్మం సహకారనగర్: తెలంగాణ ప్రభుత్వ నర్సెస్ అసోసియేషన్ ఆధ్వర్యాన రూపొందించిన క్యాలెండర్లను టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి శ్రీనివాసరావు శనివారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.మరియమ్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుశీల, బీవీ సుబ్బమ్మ, నాయకులు జైపాల్, విజయ్‌కుమార్, తాళ్లూరి శ్రీకాంత్, భూస చంద్రశేఖర్, బి.స్వరూపరాణి, మెహరిన్నిసా, అనిత, ఎస్‌కె.బీజాన్‌బీ తదితరులు పాల్గొన్నారు.

వీరుల పోరాట స్ఫూర్తితో ఉద్యమించాలి

ఖమ్మం మామిళ్లగూడెం/నేలకొండపల్లి: వీరుల పోరాట స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ఉద్యమించాలనిపలువురు వక్తలు అన్నారు. శనివారం దేశస్వాతంత్ర్య సంగ్రామంలో ప్రాణాలర్పించిన భగత్‌సింగ్, శివరాం రాజ్‌గురు, సుఖ్‌దేవ్ థాపర్‌ల వర్ధంతి సందర్భంగా ఖమ్మంలో పీడీఎస్‌యూ ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యాన, నేలకొండపల్లి మండలం అనాసాగరంలో సీపీఎం ఆధ్వర్యాన వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశాల్లో ఖమ్మంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీడీఎస్‌యూ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల అశోక్‌కుమార్, అనాసాగరంలో సీపీఎం పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్‌లు మాట్లాడారు. సామ్రాజ్యవాదానికి, పెట్టుబడుదారి విధానానికి, కులతత్వానికి, మతతత్వానికి వ్యతిరేకంగా పోరాడే ప్రజలకు భగత్‌సింగ్ స్ఫూర్తిదాయకమన్నారు. కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ ఈనెల 25న నేలకొండపల్లి మండల కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పీడీఎస్‌యూ, పీవైఎల్, సీపీఎం నాయకులు పృథ్వి, ఝాన్సీ, వంగూరి వెంకటేష్, తేలు రాకేష్, రవీందర్, గుడవర్తి నాగేశ్వరరావు, లక్ష్మీనారాయణ, సదానంద్, మారుతి కొండలరావు, ఎడ్ల తిరపతిరావు, దండా సూర్యనారాయణ, మధుసూదన్, బొడ్డు మధు, శీలం అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అశోక్ కుమార్